# మంచుతోడిన కొండ

సంధ్యవెలుగు చిరు చీకటికి వూరి పొలిమేరలలో స్వాగతమిచ్చింది. పొలాల్లో పనిచేసేపాలేర్లు పశువుల్ని మోపుతాడుతో అదిలిస్తున్నారు. కడుపులు నిండిన తల్లులు కోడెల కోసం వయ్యారంగా పొట్టలు కదుపుకుంటూ మందలో కలిసి ముందుకి నడుస్తున్నాయి. గొడ్లమెళ్ళో గంటలుచేసే చప్పుడుకి అరుగుమీద కూర్చున్న గోపాలం గుండెల్లో కొట్టినట్లయింది.

మందలోంచి రెండు ఆవులు, గేదె గోపాలం ఇంటి సందులోకి తప్పుకున్నాయి. పాలేర్ల అజ అక్కరలేకుండానే ఏఇంటి పశువులు ఆ యింటికి చేరుకోవడం చూస్తూ కూర్చోవటం గోపాలానికి చాలాకాలంగా అలవాటయింది.

ఆరోజు మందని చూసి మనస్సు ఆనందించలేక పోతోంది. తెలవారితే బంధువులు ఒకరొకరే దిగుతారు. డబ్బుకోసంచేసిన ప్రయత్నాలకి పిల్లి ఎదురైంది. ఎన్నో ఆశలు పెట్టుకున్న చిన్నతమ్ముడు, ఏ ఆలోచనా లేకుండా పిల్లని చూసి పెళ్ళికి వప్పుక్కూర్చున్నాడు.

మొదట్లో ఏలోటూ లేకుండా పెళ్ళిచేసే బాధ్యత నాది అంటూ తిరిగిన మధ్యవర్తి. వాళ్ళ చేతికి డబ్బు అందలేదని నీళ్ళు నమిలాడు. ఈముహూర్తానికి మానుకుందామంటే తల్లిని ఒప్పించలేకపోతున్నాడు! పార్వతిదగ్గర వున్న నగలన్నీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకి తన చేతులతో అమ్మాల్సొచ్చింది. పొలంమీద తెచ్చిన అప్పుతో తమ్ముణ్ణి డాక్టరుగా చదివించ గలిగాడు. తన మాటతో కలసి ఏ గొప్పింటిపిల్లనో చేసుకుంటాడని కన్న కలలన్నీ కరిగిపోయాయి. పైగా, ఎప్పుడో సంపాయించి డబ్బు పంపిస్తానంటూ పటాటోపం ఖబుర్లు చెప్పుకు తిరిగే చంద్రంమీద పట్టలేనంత కోపం వచ్చింది. అయినా పైకి తెలలేదు గోపాలం తండ్రి మాటవిని పార్వతిని

చేసుకోబట్టే ఇన్నేళ్ళు గుట్టుగా సంసారం నడవగలిగింది. ఇంక పార్వతిసొత్తులో మిగిలింది ఇల్లే. దాన్ని పెట్టి తేవాలన్నా ఎక్కడా డబ్బు పుట్టలేదు. మనస్సు పరిపరివిధాల పోతోంది. చిరాకు పుడుతోంది. పెద్దతమ్ముడు రామాన్ని అడక్కముందే కానీలేదు అంటూ గోలపెడతాడు. గాదికింద పందికొక్కులా ఇల్లు విడవడు. ఇంట్లోకి కానీ ఇవ్వడు. తన తల్లికి ఆకొడుకంటే తన ప్రాణాల్లో వకటిగా తలుస్తుంది.

అరుగు మీదనించి లేచి మండువాలోకి వెళ్ళాడు గోపాలం. పక్క గదిలోంచి కంఠాలు గట్టిగా వినబడుతున్నాయి. మధ్య మధ్య తల్లి ఆయాసంతో మాట్లాడ్డం వల్ల స్పష్టంగా తెలియటంలేదు. పెద్ద మరదలు ఉమ మాటల మధ్య ఏడుపు వినబడుతోంది. 'బట్టలు కొనుక్కునేందుకైనా ఇవ్వకపోతే ఎట్లా? పిల్లలకి వక్క మంచి గుడ్డలేదు. నా మాట అసలే అక్కర్లేదు మీ అబ్బాయికి' అంటూ వెక్కుతోంది.

'వాడి తత్వం అల్లాటిది. ఏమి చెయ్యటం, చెప్పు, వాడిని మరీ విసిగించకు. అసలు పెళ్లి సమయానికి రాకుండా వెళ్ళిపోతాడేమోనని నా బెంగ. అయినా పెద్దాడు డబ్బు కోసం చూస్తూనే వున్నాడుట. అందగానే ముందు నీకు, నీ పిల్లలకి కొనిపించే బాధ్యత నాది, సరేనా' అంటూ రావాయమ్మగారు జారిపోతున్న పట్టుపంచిని పైకితీసి పట్టుకుంటూ పంచలోకి వచ్చింది.

ఆ మాటలు వింటూన్న గోపాలానికి తల్లిమీద కోపం వచ్చింది. ఎంతసేపు పెద్దాడిచేత చేయించాలని చూస్తుందే తప్ప చిన్న కొడుకుని కానీ ఖర్చు పెట్టనివ్వదు. ఇప్పుడు ఏమి అనుకుంటే ఏమిలాభం? తెల్లవారి జరిగే వుపాయం చూడాలి, అనుకుని వంటింటి గడపలో కాలుపెట్టాడు.

పొయ్యిలో పెట్టిన కట్టెలమంట పెడలోనుంచి పైకి తొంగిచూస్తూ పొయ్యి పక్కనవున్న చీకటితో ఆడుకుంటున్నట్టు వుంది. పొయ్యిముందు కూర్చున్న పార్వతి మెళ్ళోనానుతాడు ఆ వెల్తురికి కొద్దిగా మెరిసింది.

గోపాలానికి ఆవస్తువుచూడగానే మనస్సు ఎంతోతేలికై నట్లుతోచింది. నీటిలో మునిగినవానికి ఆసరా దొరికినంత ఆనందం కలిగింది. కంఠం సవరించుకుని 'చూడు ఇవాళ ఎక్కడికి వెళ్ళినా డబ్బు సర్దుబాటుకాలేదు' అని నసుగుతున్నాడు గోపాలం.

చెపుతున్నది తనతోకానట్టు అన్నం వారుస్తోంది, పక్కకితిరిగి పార్వతి.

మళ్ళీ కంఠం హెచ్చించి చెప్పాడు గోపాలం.

'ఇంకేమి కుదవబెట్టేందుకు మిగలల్లేదుకాబోలు' నని దెప్పింది పార్వతి.

సర్లే, సావకాశంగా తరువాత దెప్పుకుందువుగాని, ఈసారికూడా నీ వస్తువ పట్టుకెడితేనేకాని కార్యం పూర్తి అయ్యేటట్టులేదు. మెళ్ళోవున్నది ఇస్తావా అని గోపాలం సౌమ్యంగానే అడిగాడు.

అన్నంగిన్ని పెడమీదకిజరిపి చారుగిన్ని పొయ్యి మీద పెడుతున్న పార్వతికి ఆ మాటలు వినిపించాయి. ఎంతోకాలం వోర్చుకున్న సహనం మరుగుపడి వుద్రేకం మాటలతో బయటపడింది. "ఏమయినా ఇవ్వను. తీసుకున్నవి చాలవుకాబోలు, ఈ పక్కటీ మీ కంట పడకుండా దాచుకున్నా. మీ నిర్వాకంతో చేయించమని నేనేం అడగలేదుగా.'

ఆ మాట పూర్తికాకుండానే గోపాలం సహనం దిగజారింది. పార్వతిపైన చెయ్యి చేసుకున్నాడు. పార్వతి పెనుగు లాడటంలో పొయ్యిగట్టుకి కొట్టుకుంది. గిన్నెవరిగి పొయ్యి చల్లారింది. గోపాలంలో అహం కరిగి, సిగ్గుగామారి, తను చేసినపనికి తల కిందకివరిగింది.

పార్వతి కదిలింది. శరీరం స్వాధీనములోకి తెచ్చుకుంటూ, పంటినించికారే రక్తాన్ని కొంగుతో వత్తుకుని, దుఃఖములో పెట్టిన వైరాగ్యపుతెర జారకుండానే పుస్తెల తాడుతీసి

గోపాలం పాదాల మీదకి విసరింది.

గోపాలంలో జాలి, దుఃఖం కలిసి మనిషిలో చైతన్యం లేకుండా చేశాయి. పార్వతికేసి చూపునిల్పి నిల్చున్నాడు.

ఎప్పటినించి నిల్చుందో రావాయమ్మ గోపాలం పాదాలదగ్గరికి వచ్చి కూర్చుంది. సూత్రంతాడు చేతిలోకి తీసుకుని 'ఆగంచెయ్యకుండా ఏనాడు ఇచ్చింది కనక? అంటూ కొడుకు మనస్సుకి హితవుగా మాట్లాడింది.

గోపాలానికి ఆ క్షణంలో తల్లిమీద ఏవగింపు కలిగింది కోడలి పక్షం మాట్లాడి, తన్ని మందలించాల్సిన తల్లే ఇల్లా మాట్లాడుతోంది. అక్కడే వుంటే మళ్ళ తనెవర్ని ఏంచేస్తానో నన్న అధైర్యంతో మెల్లిగా పెరట్లోకి వెళ్ళి పోయాడు.

రామాయమ్మతో లోపలే మాట్లాడుకుంటూ పసుపు తాడుకి సూత్రాలు గుచ్చి పార్వతి మెళ్ళోవేసి, రెండుపేటల పుస్తెలతాడు వకసారి తిప్పిచూసి బొడ్లో పెట్టుకుంది.

దుఃఖాన్ని అదుపులో పెట్టలేక పార్వతి మొద్దుబారిన శరీరాన్ని దక్షిణంవైపు వసారాలోకి చేరవేసింది. గతంలో ఎన్నిసార్లు గోపాలం చేతిలో దెబ్బలు తినలేదు. కాని ఈసారి మనస్సు సమాధానపడ వద్దని ఎదురు తిరుగుతోంది. ఎన్నో ఆలోచనలువచ్చి ఎంతసేపో ఏడిపించాయి. నిద్రాదేవి ఎప్పుడో తన చల్లని చేతులతో నిమిరి దగ్గరకి తీసుకుంది. పార్వతికి మెలుకువ వచ్చేసరికి వెల్తురు వీధుల్లో కళ్ళాపు జల్లుతోంది. ఇంట్లోకి వెళ్ళింది. కొయ్యకివున్న పాతచీర తీసి చుట్టి పట్టుకుని తోటికోడలు కేసి చూసింది. ఉమ వుత్సాహంగా అత్తగార్ని ప్రశ్నలువేస్తోంది. రావాయమ్మగారు పెద్దకోడలితో మాట్లాడాలని దగ్గుతూ కంఠం సవరించుకుంటోంది. పార్వతి వెనక్కి తిరిగి మెట్లు దిగుతూంటే ఎక్కడి కెడుతోందని చిన్నకోడల్ని కళ్ళతో ప్రశ్నించింది. తెలియదన్నట్టు పెదిమవిరిచింది ఉమ.

పార్వతి పెరటి తలుపు తెరిచి కాలవగట్టు చేరింది. కొన్ని ఏళ్ళు అయింది తను రోడ్డుమీద నడచి. ఏదో తప్పుచేస్తున్నట్లు తోచింది మనస్సుకి. మళ్ళీ సమాధానపడి ముందుకి నడిచింది. బల్లకట్టుదాటి మేనత్తగారివూరు వెడదామనుకుంది. మళ్ళీ బుద్ధిపుట్టలేదు. ఇన్నేళ్ళయి వక్కసారైనా తన విషయం కనుక్కున్నవాళ్ళు లేరు, తనెందుకు వెళ్ళటం అనుకుంది. ఎక్కడి కెళ్ళాలనీ తోచలేదు. గుడి వెనక పాకలో వుంటూన్న ఆండాళమ్మ దగ్గరకు వెళ్ళింది.

పార్వతిని చూసి తెల్లబోయింది ఆండాళ్ళు. పార్వతి రావిచెట్టు మొదట్లో కూర్చుంటూ "మరేంలేదు, వకటి రెండు రోజులు వుండిపోదామని వచ్చా"నంటూ కళ్ళు వత్తుకుంది. ఆండాళ్ళు ఏదో వోదార్చింది విషయం అడక్కుండానే. తనూ కళ్లు వత్తుకుంది. అరోజు తిరిగిపోయింది.

గోపాలానికి పార్వతి కనపడక ఏదోవంకని ఇల్లు అంతా తిరుగు తున్నాడు. తల్లిని అడగటానికి మనస్సు ఒప్పుకోలేదు. తల్లికూడా పెద్ద కోడలిమాట ఎత్తకపోవటం చూస్తే గోపాలానికి అర్థం కావటం లేదు.

నానుతాడు అమ్మిన డబ్బుతో అవసరాలు గడుస్తున్నాయి. పెళ్ళికొడుకు చంద్రం స్నేహితులకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయించాడు. అన్ని ఖర్చులు గోపాలంమీదే పడ్డాయి. అక్క, చెల్లెలు పెద్దవదినేదిరా అని చంద్రాన్ని ఆరాతీశారు. ఇంట్లో ఎవరు వున్నదీ లేనిదీ పట్టించుకోని చంద్రానికి పెద్దవదిన అప్పుడు అజకి వచ్చింది. రావాయమ్మ గారు కొంగు ముందుకి లాక్కుంటూ వాళ్ళ మధ్యకి వచ్చి కూర్చుని వాళ్ళ ప్రశ్నకి పెద్దకోడలుమీద కథలా చెప్పుకుపోతుంది. వింటూన్న పెద్దకూతురు జయ తల్లిమీద విసుక్కుంటూ అన్నయ్య కోపంలో అన్నాడే అనుకో, నువ్వెల్లా వెళ్ళనిచ్చావే అని అడిగింది. ఆ, ఎక్కడి కెడుతుందిలే,

వాళ్ళమేనత్తయింటికి వెళ్ళివుంటుంది. నాలుగురోజులు పోయాక వాడే వెళ్ళి తీసుకొస్తాడు అని గర్వంగా జవాబిచ్చింది కూతురికి. అంటే ఈ పెళ్ళికి పెద్దవదిన రానక్కర్లేందంటావు అంది జయ. నీ తెలివి తెల్లారినట్టవుంది. వాళ్ళు వాళ్ళు ముళ్ళేట్టుకు అది వెళ్ళిపోతే నేనేదో అన్నట్టు మాట్లాడతావేమిటే అని కూతుర్ని కూకలేసింది.

జయకి తల్లిమనసు అర్థంకాలేదు. అన్నగారు తనకి వున్నదీ లేనిదీ చూసుకోకుండా కుటుంబంకోసం కష్టపడ్డాడు. వొదినగారి సొమ్ములు అన్నీ తీసుకొని ఆస్తిఅంతా అమ్ముకుని ఇంటెడు చాకిరీ చేయించి, నేరాలుచెప్పి ఇద్దరిమధ్యా ఎన్నో సార్లు తంటాలు పెట్టినా వెళ్ళని వదినగారు ఇప్పుడు ఎక్కడికి వెళ్ళినట్టు? వెళ్ళినావిడకోసం ఎవరూ వెళ్ళకపోవటం చూస్తే మరీ చిరాకేసింది.

పెద్దన్నదగ్గర మళ్ళీ ఆ మాట ఎత్తబోయింది. అక్కడినించిలేచి ఏదో పనిమీద వెళ్ళిపోవటంచూసి అసలు ఆ ఇంటి మనుషులమీదే ఏవగించుకుంది.

పెద్దవదిన మంచితనం కళ్ళముందు పరచినట్లు అయింది. ఆ నాడు తను ఆ నగలు ఇచ్చివుండకపోతే, ఈ నాడు తనింత సుఖపడేదేనా? ఎక్కడుందో తెల్సుకుని తనతో తీసుకెళ్ళి వీళ్ళు గోలపెడితేకాని పంపకూడదన్న నిర్ణయానికివచ్చి మనస్సు తేలికచేసుకుంది జయ. పెళ్ళి పెద్దరికం తనకి వచ్చినందుకు ఉమకి చాలా సంతోషంగా వుంది. పైకి తోటికోడలు కోసం వాపోతోంది. గోపాలం ఒక్క డబ్బు ఖర్చుపెట్టడం మినహా మిగిలిన విషయాల్లో దూరంగానే తిరుగుతున్నాడు. చంద్రానికి పెళ్ళికూతురికి ఇంకా మంచిబట్టలు అవీ పెట్టలేక పోయినందుకు ఇంట్లో వాళ్ళమీద కోపగించుకున్నాడు. చెల్లెలు శాంతకి వేడుకలు జరగలేదని అలిగి వెళ్ళిపోయింది. రావాయమ్మగారు కొత్తకోడలి ఆకారంచూసి మురిసిపోయింది. మొదటిరోజు. మర్నాడే తనవంటూ కనపడ్డ సామాన్లు సర్దుకోవటం చూసి కొయ్యబారింది.

పెళ్ళింట్లో పచ్చదనం తిరుగుతున్నా, గోపాలం మనస్సులోని చీకట్లని కదపలేదు. గోపాలం ఇంటి ఆవరణని కొత్త మనిషికి చూపెట్టడం జయ చూసింది. ఇల్లు అమ్ముతున్నట్టు గ్రహించేందుకు ఎక్కువశ్రమ పట్టలేదు. గోపాలం పైగుడ్డతో నుదురు వత్తుకున్నాడు. జయ అన్నగారి కేసి చూసింది.

గోపాలం తప్పుకు వెళ్ళిపోయాడు. అండాళ్ళు ఇంట్లో పార్వతి వున్నదని తెల్సినప్పుడే వెళ్లాలనుకున్నాడు. గుళ్లో వెళ్ళి శూన్యానికి నమస్కరించాడు. ఇంకెప్పుడూ పార్వతిని హింసపెట్టనని ఆత్మసాక్షిగా చెప్పుకున్నాడు. పార్వతిని తనకి మామగారు అప్పచెపుతూ బోలెడు డబ్బు చేతిలో పెట్టాడు. ఇన్నాళ్లు డబ్బుకింద వుండిపోయింది. ఈరోజుతో డబ్బువిడి మంచుకరిగిన కొండలా పార్వతి స్వచ్ఛంగా దీనంగా మనస్సులో మెదిలింది. అందరి బాధ్యతలు సవ్యంగా నిర్వహించి వొడ్డు ఎక్కించ గలిగాడు. ఇంక పార్వతికోసం తను మిగిలాడు. పార్వతిని పువ్వుల్లో పెట్టగలడేమో కాని మేడల్లో పెట్టడం వట్టిమాటే. చిరిగినచొక్కా తన స్థితిని గుర్తుచేసింది.

బరువుగా నడుస్తూ ఆండాళ్ళు పంచలో అడుగు పెట్టాడు. పార్వతి మొహం పక్కకి తిప్పుకుంది. పాతచీర వెనక పాలిపోయిన పొట్టమడతలు చిక్కుపడ్డ జుట్టులోంచి విడిపోయిన వుంగరాలు నుదురుమీదపడి నీరసంతో వున్న మొహంలో నిర్మలంగా మెరిసేకళ్ళు పార్వతి వయస్సునీ వెనక్కి జరిపాయి. గోపాలం పార్వతిచెయ్యిని చేతిలోకి తీసుకుని భాషలేని భావాలతో ఎన్నో తప్పులని వప్పుకొని కనికారంకోసం చూశాడు. పార్వతికళ్ళు నీరసంగా అంతజాలిని చూడలేక రెప్పలు బరువుగా కిందికి జారాయి. అండాళ్ళు తెచ్చిన పాలగ్లాసు జయకు ఇద్దరికీ ఇచ్చి తన మనస్సు సంతోషంతో నింపుకొంది. మళ్ళీ క్రొత్త జీవితం వూహిస్తున్నాడు గోపాలం. పార్వతి ఏమనుకుంటున్నారో! ✧